చిక్కిపోతున్న కాలువగట్లు

- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ శాఖ
- పంట ఉత్పత్తుల తరలింపులో రైతులకు ఇబ్బంది



పెదపళ్లలో ఆక్రమణలకు గురైన జోడిచెట్ల కాలువగట్టు

ఆలమూరు: కొంతమంది రైతుల అత్యుత్సాహం, స్వార్థ ప్రయోజనాలను ఆశించడం వల్ల కొన్ని కాలువ, పొలం గట్లకు ఆక్రమణల బెడద పట్టుకుంది. ఇరిగేషన్ శాఖకు కాలువ గట్లపై సరైన నియంత్రణ లేకపోవడంతో భారీ వెడల్పు కలిగిన కాలువగట్లు బక్కచిక్కిపోతున్నాయి. రియల్ బూమ్ గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి సాగు భూములన్నీ నివాస స్థలాలుగా మారిపోతున్నాయి. దీనివల్ల పంట పొలాల రక్షణకు, ఉత్పత్తుల తరలింపుకు ఏర్పాటు చేసిన గట్లు కనుమరుగవుతున్నాయి. దశాబ్దకాలం క్రితం సుమారు ఎనిమిది నుంచి పది అడుగుల వెడల్పు కలిగి ఉండి నాలుగు చక్రాల వాహనాలు ప్రయాణించగలిగే పరిమాణమున్న గట్లు నేడు సగటు రైతు నడవ లేని స్థితికి చేరుకున్నాయి. దీనివల్ల సౌకర్యకరంగా లేకపోవడంతో నారుమళ్లు, మాసూళ్ల విషయంలో అధిక వ్యయం అవుతుందని సన్న, చిన్న కారు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వరి మసూళ్లు జరుగుతున్నందున రైతులు తమ పంట ఉత్పత్తులను తరలించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అక్రమార్కులు గట్లు నరుక్కుంటూ తమ చేలల్లో కలుపుకుంటూ పోవడం వల్ల కొన్నేళ్లకు అసలు పొలంగట్లు మిగిలే అవకాశం ఉండదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఆక్రమణల సంగతి అలా ఉంచితే పంట బోదెలు కూడా మాయమవుతుండటంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతుంది. వర్షాలు అధికంగా కురిసే సమయంలో ముంపు బారి నుంచి రక్షించవలసిన పంటబోదెలు కూడా అన్యాక్రాంతమవడం రైతులను మరింత కుంగదీస్తుంది. ఇప్పటికే కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో పలు చెరువు గట్లు ఆక్రమణదారుల చేతిలోకి వెళ్లిపోయాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాక క్షణాల్లో పొలంగట్లు అదృశ్యమై పంటచేలుగా మారిపోతున్నాయి.

ఆక్రమణల చెరలోనే కాలువగట్లు

క్లస్టర్ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సుమారు 50 వేల ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. దీనికి అనుకుని సుమారు మూడు వేల ఎకరాల వరకూ కాలువ, పొలం గట్ల స్థలాలు ఉన్నాయి. పెద్ద కాలువ గట్టు విస్తీర్ణం 10 మీటర్ల నుంచి 15 మీటర్ల వరకూ, మీడియం పంట కాలువ గట్టు విస్తీర్ణం నాలుగు నుంచి ఐదు మీటర్ల వరకూ, పంట బోదెలు రెండు నుంచి మూడు అడుగుల వరకూ ఉండాలని ఇరిగేషన్ శాఖ రికార్డులు చెబుతున్నాయి. ప్రస్తుతం అలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ప్రస్తుతం అధికారుల అనధికార లెక్కల ప్రకారం వందల ఎకరాల భూమి ఆక్రమణదారుల కబంధ హస్తాల్లో చిక్కుకుపోయిందని తెలుస్తోంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో చేపట్టిన జగనన్న భూరక్షలో కాలువగట్లు ఆక్రమణలు బయటపడినా తదనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్రమణలపై ఉన్నతాధికారులకు నివేదించాం



కాలువగట్లు ఆక్రమణ, లోపలి రైతులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. వారి సూచనలకు అనుగుణంగా చర్యలు చేపడతాం. జగనన్న భూరక్ష సర్వేలో ఇప్పటికే కాలువ గట్లను గుర్తించాము.

– టి.కృష్ణత్రిమూర్తులు, ఇరిగేషన్ జేఈ, ఆలమూరు

గట్లను పునరుద్ధరించాలి



పంట కాలువలు, పంట బోదెలను ఆక్రమించుకున్న ఆక్రమార్కుల నుంచి గట్లను స్వాధీనం చేసుకోవాలి. కొంత మంది చేసిన కబ్జాల వల్ల లోపల పొలాలు ఉన్న రైతాంగం తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటుంది. పంట కాలువలను సైతం పూడిక తీసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– గారపాటి శ్రీనివాసచౌదరి, నీటిసంఘం అధ్యక్షుడు, చింతలూరు

ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి



గంటిలో విద్యార్థులకు డైరీలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బంగారాజు

కొత్తపేట: విద్యార్థులు తమకు వచ్చే ప్రతి అవకాశాన్ని అందుపుచ్చుకుంటూ పాఠశాల స్థాయి నుంచే భవిష్యత్తు ఉన్నతికి బాటలు వేసుకోవాలని గంటి సర్పంచ్ సాగి బంగార్రాజు ఉద్బోధించారు. మండలంలోని గంటి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ బంగార్రాజు తన సొంత నిధులతో సమకూర్చిన డైరీలను శనివారం విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం అక్కిరెడ్డి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ బంగార్రాజు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు వినయ విధేయతలు, క్రమశిక్షణ ముఖ్యమన్నారు. పెద్దలు, ఉపాధ్యాయులపై గౌరవ భావంతో మెలగాలని ఆయన సూచించారు. సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. తద్వారా తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చీకరమిల్లి హంసలేఖ, వైస్ చైర్మన్ నున్న సుబ్రహ్మణ్యం, పంచాయతీ సెక్రటరీ టి.వెంకట కృష్ణ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ ఎం.అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా కిచెన్ గార్డెన్‌లు



దిండి ర్యాలీలో పాల్గొన్న రైతులతో సర్పంచ్ శ్రీనివాసరాజు

మలికిపురం: మండలంలోని దిండి గ్రామంలో సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయ ప్రచారం, ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్‌పై శనివారం గ్రామసభ జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పొలంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని, ప్రతి ఇంటి వద్ద సొంతంగా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యూనిట్ ఇన్‌చార్జ్ కిరణ్ మాట్లాడుతూ ప్రతి రైతు నవధాన్యాల సాగు చేపట్టాలని ఇప్పటికే 30 మంది రైతులతో 30 ఎకరాల్లో నవధాన్యాలు సాగు చేపట్టమని దీని ద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు. అంతేకాక రైతుకు పెట్టుబడి ఖర్చు తక్కువవుతుంది అని వివరించారు. రైతు రాపాక సత్యనారాయణను సర్పంచ్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం పీఎండీఎస్ పై ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచ్ కట్టా బాలరాజు, గొల్ల సుధాకర్, గ్రామ కార్యదర్శి సునీల్, వీఏఏ నాగదుర్గ, ఐఈఆర్‌పీ ఎస్.మౌనిక, సూర్యకుమారి, స్వర్ణకుమారి రైతులు పాల్గొన్నారు.

సేవలందించేవారికి ఎల్లవేళలా గుర్తింపు



వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా పాఠశాల అభివృద్ధికి ఉత్తమ సేవలు అందించే వారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఐవీ రావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన బొక్కా వెంకటేశ్వరరావు సన్మాన సభ హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన శనివారం జరిగింది. వారు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను క్రమశిక్షణతో విద్యాభ్యాస్యం చేసి వారి భవిష్యత్‌కు శ్రీనివాస్ బంగారు బాటలు వేశారన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన వెంకటేశ్వరరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సహోద్యోగులు, అధికారులు, విద్యార్థులు పాల్గనారు.

విద్యాభివృద్ధికి దాతల సాయం అవసరం



కోఆర్డినేటర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న పాఠశాల నిర్వాహకులు

అయినవిల్లి: విద్యాభివృద్ధికి దాతల సాయం అవసరమని జెడ్పీటీసీ సభ్యుడు, పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. శనివారం ముక్తేశ్వరం జయంతి రామయ్యపంతులు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జయంతి కామేశ్వరరావు రూ.5 లక్షల నిధులతో సభావేదిక నిర్మించారు. ఈ వేదికను గన్నవరపు శ్రీనివాసరావు ప్రారంభించారు. అలాగే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గణేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన వీడ్కోలు సభకు ముఖ్యఅతిథిగా వ్యవహరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ దాతలు విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం గన్నవరపు శ్రీనివాసరావును సత్కరించారు. స్థానిక సర్పంచ్ కుడుపూడి శాంతావతి, ఎంపీటీసీలు యాడ్ల కిరణబాబు, రమణాతి వెంకటలక్ష్మి, కూటమి నాయకులు, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు పోరాటం



మానవహక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

పి.గన్నవరం: సామాన్య ప్రజల హక్కులను పరిరక్షించేందుకు నిరంతరం పోరాటం సాగిస్తామని మానవ హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొండ్రెడ్డి బాలాజీ అన్నారు. పి.గన్నవరంలోని సాయితేజ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శనివారం జిల్లా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన బాలాజీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. పరిరక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా జల్లి జాషువా, ప్రధాన కార్యదర్శిగా బీఎస్‌డీ లావణ్య, మహిళా కార్యదర్శులుగా గెడ్డం సుదర్శిణి, కడలి మాధవి, దుర్గా లక్ష్మీ తులసి రమాదేవి, ఎ.శారదాకృష్ణ, కార్యదర్శులుగా కోట సత్యనారాయణ, పినిశెట్టి వెంకటేశ్వరరావు, తోలేటి సుబ్బారావు, పితాని వెంకటేశ్వరరావు, కె.కె.ఫణీంద్ర, వీఎస్‌కే చైతన్య, పొల్నాటి నాగప్రసాద్ తదితరులు ఎన్నికయ్యారు.

సంపద తయారీ కేంద్రాలపై ప్రత్యేకశ్రద్ధ



ఆలమూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుధ్య చర్యలపై వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఉన్నతాధికారులు

ఆలమూరు: చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాలపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని జిల్లా ప్రత్యేకాధికారి రవి సుభాష్ పాటంశెట్టి, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీపీఓ డి.శాంతాలక్ష్మితో కలసి శనివారం వారు పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరిస్తున్న విధానాన్ని పారిశుధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డు సమస్య లేకుండా గృహాల నుంచి సేకరించిన చెత్తను సంపదగా తయారు చేసే బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. అలాగే ఈ-వేస్ట్ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సేకరించిన ఈ-వేస్ట్‌ను మండలంలో ఒక చోట భద్రపరచి రీసైక్లింగ్ చేసే సంస్థలకు తరలించాలని సూచించారు. నివాసాల్లోను, కార్యాలయాల్లోనూ నిరుపయోగంగా ఉండే ఎలక్ట్రానిక్ ఉపకరణ వ్యర్థాలు సమాజానికి కీడు చేసే అవకాశం ఉందన్నారు. అనంతరం స్థానిక మండల స్థాయి అధికారులతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, ఎదుర్కొంటున్న పారిశుధ్య కార్మికుల కొరత తదితర సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆకట్టుకున్న స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంతో పల్లెలను పరిశుభ్రం చేయాలని రామచంద్రపురం కొత్తపేట డీఎల్‌డీఓ ఎస్‌టీవీ రాజేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీని ఆయన ప్రారంభించారు.

మలికిపురం: గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా, ఫైలేరియా వ్యాధులపై ప్రజలు అవగాహన కల్పించుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని లక్కవరం, కేశనపల్లి ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. వైద్య పరీక్షల కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. లక్కవరంలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో..

మామిడికుదురు: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని నగరం, లూటుకుర్రు సర్పంచ్‌లు జాలెం రమణకుమారి, అడబాల తాతకాపు పేర్కొన్నారు. మూడో శనివారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ పారిశుధ్యం సాధ్యమవుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.

అలరించిన బాలల నృత్య ప్రదర్శన



వాడపల్లి క్షేత్రంలో వేంకటేశ్వర వైభవం నృత్యరూపకం



వాడపల్లి క్షేత్రంలో బాలల కూచిపూడి నృత్య ప్రదర్శన

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం నిత్య కల్యాణం పచ్చతోరణంలా తిరుమల క్షేత్రాన్ని తలపిస్తుంది. తిరుమల క్షేత్రంలో మాదిరిగా ఈ వాడపల్లి క్షేత్రంలో ప్రతి శనివారం రాత్రి వివిధ సంప్రదాయ, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ధర్మపథంలో భాగంగా విశాఖపట్నం కళారాధన సంగీత నాట్య కళాశాల కళాకారిణుల బృందం శ్రీవేంకటేశ్వర వైభవం తదితర నృత్య రూపకాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన భక్తులను విశేషంగా అలరించింది. కళాకారిణులు, నాట్యగురువులను దేవదాయ-ధర్మదాయ శాఖ డీసీ, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు, పలువురు ప్రముఖులు అభినందించారు.

భగవద్గీత శ్లోకాల పఠనంలో లక్ష్మీహన్వితకు అవార్డు



యెనుముల లక్ష్మీహన్విత (ఫైల్)

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలేనికి చెందిన నాలుగో తరగతి విద్యార్థిని యెనుముల లక్ష్మీహన్విత(9) భగవద్గీత పఠనంలో నిర్వహించిన ఆన్‌లైన్ పోటీల్లో ఉత్తమ అవార్డుకు ఎంపికై ంది. వివరాలు హన్విత తండ్రి యెనుముల రమణ మీడియాకు శనివారం చెప్పారు. మైసూరులోని అవధూత దత్త పీఠం, పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆధ్వర్యంలో ఇటీవల నాలుగు స్టేజ్‌లలో భగవద్గీత శ్లోకాలు పఠనంపై నిర్వాహకులు జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహించారు. నాలుగు స్టేజ్‌లలో హన్విత విజయం సాధించి ఫైనల్ పోటీలకు ఎంపికైనట్టు రమణ అన్నారు. అనంతరం ఫైనల్ పోటీల్లో ఆన్‌లైన్‌లో పాల్గొన్న 600 మంది విద్యార్థినిలలో హన్విత గెలుపొంది ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్టు ఆయన అన్నారు. ఈ అవార్డు కింది గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని మైసూర్‌లో పీఠాధిపతి నిర్వాహకులతో మే 17న అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. కాగా చిన్న వయసులోనే భగవద్గీత శ్లోకాలు పఠనంలో విశేష ప్రతిభ, ప్రావీణ్యత చూపిన హన్వితకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



సఖినేటిపల్లిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో శనివారం దైవజనులు, విశ్వాసులు రన్ ఫర్ జీసస్ (సువార్త దండయాత్ర) ర్యాలీ నిర్వహించారు. పై రెండు మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సఖినేటిపల్లి రేవు వద్ద నుంచి లక్కవరం సెంటర్ వరకూ సుమారు 20 కిలోమీటర్లు మేర ఈ భారీ బైక్ ర్యాలీ చేశారు. ఈస్టర్ సండేకు ఒక రోజు ముందు ఈ కార్యక్రమం చేపట్టినట్టు వారు తెలిపారు. పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు దేవ సాల్మన్, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, క్రైస్తవులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో 3,557వ ర్యాంకు



తోట ఎమ్మెన్వీ వెంకటరాజు

ఆలమూరు: మండలంలోని సంధిపూడికి చెందిన తోట మోహన్ నాగ వీర వెంకటరాజు జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా స్థాయిలో ఓపెన్ కేటగిరిలో 3557వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి వెంకటరాజు మాట్లాడుతూ ఐఐటీలో సీటు పొంది తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుతానని తెలిపారు. తల్లి భవానీ గ్రామ సర్పంచ్‌గా కాగా తండ్రి వెంకటేశ్వర్లు రాజకీయాల్లో ఉన్నారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన వెంకటరాజును పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అభినందనందించారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: మండలంలోని మందపల్లిలో శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. డీసీ అండ్ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,62,425 ఆదాయం వచ్చినట్లు చక్రధరరావు తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.46,072 రాగా మొత్తం 2,08,497 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. సీఐడీ (ఐపీఎస్) అధికారి కట్టన ఈశ్వర్ కుటుంబ సమేతంగా స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. పూజల అనంతరం వేదపండితుల వేదాశీర్వచనంతో స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాత శ్రీనివాసరెడ్డికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకుడు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వడ్లమాని సోమశేఖర్ రూ.10,116, పెనుమంట్ర మండలం నెగ్గిపూడి గ్రామానికి చెందిన తాడి వెంకట శ్రీనివాసరెడ్డి రూ.10,116 విరాళం అందజేశారు. దాతలు ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతలను ఆలయ సిబ్బంది అభినందించారు.


ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సంధిపూడిలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆలమూరు: మండలంలోని సంధిపూడి ఎంపీయూపీ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. పాఠశాలలోని ఒకటో తరగతి పూర్తి చేసుకుని రెండో తరగతిలో ప్రవేశిస్తున్న సందర్భంగా ఎస్ఎంసీ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసు, ఉపాధ్యాయుడు, బి.లోకేష్ ఈ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులను ధరింపజేసి పట్టా అందజేశారు.

ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా



ఈదరాడలో ట్యాంకరు ద్వారా తాగునీటి సరఫరా

మామిడికుదురు: ఈదరాడ గ్రామ పరిధిలోని కమ్మవారిలంక, కొంగులపేటకు శనివారం ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. ఆ రెండు ప్రాంతాలకు నీరు అందించే పైప్‌లైన్ పాడైపోయింది. దీనిపై స్పందించిన గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా తాగునీరు అందించి మంచినీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, పంచా యతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు ఆధ్వర్యంలో ఈ చర్య లు చేపట్టారు. స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి



వాడపల్లి వెంకన్న ఆలయంలో హైకోర్టు జడ్జి రాజశేఖరరావు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారిని హైకోర్టు జడ్జి టి.రాజశేఖరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. హైకోర్టు జడ్జి శనివారం రాత్రి ఆలయానికి రాగా ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం సిబ్బంది, అర్చకులు స్వాగతం పలికి స్వామి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలతో స్వామివారి చిత్రపటం అందజేశారు.

జగన్మోహినీ కేశవస్వామి సన్నిధిలో జడ్జి

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి చెందిన జగన్మోహినీ కేశవస్వామిని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మాదాల వెంకటసరస్వతి సుబ్బారావు దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం జడ్జి సుబ్బారావుకు దేవస్థానం సిబ్బంది, అర్చకులు స్వాగతం పలికారు. పూజలు అనంతరం వేదాశీర్వచనం మండపం వద్ద పండితులు వేదాశీస్సులతో స్వామివారి చిత్రపటాన్ని అందచేశారు.

22న స్వామి వారి మాస కల్యాణం

జగన్మోహినీ కేశవస్వామివారికి ఈ నెల 22న (మంగళవారం) శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని మాస కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. గోత్రనామాలతో కల్యాణం జరిపించుకునే భక్తులు రూ.750 చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

జెర్రిపోతు హల్‌చల్

అంబాజీపేట: స్థానిక పి.గన్నవరం రోడ్డులో ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ షాపులో జెర్రిపోతు హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నిట్టాల రామ సుబ్రహ్మణ్యం షాపులోకి జెర్రిపోతు ప్రవేశించి హల్‌చల్ చేయడంతో షాపు యజమానితో పాటు పక్కన ఉన్న షాపుల వారు భయాందోళనకు గురై భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. దాంతో వర్మ జెర్రిపోతును చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించారు. జన సంచారం లేని ప్రాంతంలో ఆ పామును వదిలిపెట్టారు.

మట్టి తరలిస్తున్న లారీ సీజ్

పి.గన్నవరం: ఈనెల 10వ తేదీతో గడువు ముగిసినా మానేపల్లి లంక నుంచి పెదకందాలపాలెం మీదుగా తువ్వ మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా నిర్వహిస్తున్నారు. దీంతో తహసీల్దార్ పి.శ్రీపల్లవి శనివారం ర్యాంపులో దాడులు నిర్వహించారు. తువ్వ మట్టి తరలిస్తున్న ఒక లారీని సీజ్ చేశారు. గడువు మీరిన నేపథ్యంలో మట్టి తవ్వకాలు జరుపకూడదని తహసీల్దార్ హెచ్చరించారు. దాడుల్లో ఆర్ఐ యన్నపు డాంగే, వీఆర్వో నాగన్న పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.